www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
01.03.2025



## మీనాక్షి నటరాజన్‌తో
# కూచాడి భేటీ

కలంజ్యోతి, నిర్మల్ : నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీ హరిరావు ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్ ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గాంధీభవన్ లో తొలిసారిగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమావేశానికి మీనాక్షి హాజరుకాగా.. కూచాడి శ్రీహరిరావు గారు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- మృతదేహాలను వెలికితీతకు ముమ్మర చర్యలు
- ఇప్పటికి ఐదుగురి గుర్తింపు.. మరో ముగ్గురి ఆచూకీ కోసం గాలింపు
- సహాయక చర్యల వేగవంతానికి రంగంలో ఎన్‌జీఆర్ఐ బృందం
- అధికారికంగా ప్రకటించని సర్కార్
- టన్నెల్ ప్రమాద మృతుల్లో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజినీర్లు



# సజీవ సమాధి

## మట్టిలో మూడు మీటర్ల లోతులో
## 8 మంది కూరుకుపోయినట్లు గుర్తించిన రాడార్



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :**
తెలంగాణలోని ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లిఫ్ట్ బకింగ్ కెనాల్) టన్నెల్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారు. మృతుల్లో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజినీర్లు ఉన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచే అధికారులు, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి క్షతగాత్రుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మట్టిలో వారు మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్లు అధునాతన పరికరాలు సూచించాయి.
గ్రౌండ్ పైన ట్రేటింగ్ రాడార్ మెషీన్ ద్వారా మట్టిలో కూరుకుపోయిన 5 మృతదేహాలు గుర్తించారు. ఈ 5 మృతదేహాలను వెలికి తీయడానికి మరింత సమయం పడుతుందని, కొన్ని మీటర్ల లోతు మట్టిలో మృతదేహాలు కూరుకు పోయినట్లు తెలుస్తోంది. మిగతా ముగ్గురి మృతదేహాల కోసం అధికారులు గాలిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) రంగంలోకి దిగింది. భూమిలో కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తోంది. జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) టెక్నాలజీని ఉపయోగించి, భూమిలోకి తొలగిపోయిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందం శ్రమిస్తోంది. మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసింది. ఎన్‌జీఆర్ఐ

మిగతా 2లో



## త్వరలో నామినేటెడ్
# పోస్టులు
సీఎం రేవంత్ రెడ్డి

- కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేస్తాం
- పదవులు వచ్చిన వారు పార్టీ కోసం కష్టపడాలి

4లో




## వరంగల్ ఎయిర్ పోర్టుకు కేంద్రం
# గ్రీన్ సిగ్నల్





# పొదుపుతోనే భవిష్యత్తుకు భరోసా

## అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

**కలంజ్యోతి, జగిత్యాల :** రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్లో వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ బి. ఎస్. లత ముఖ్య




అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ప్రతి ఒక్కరికీ తమ ఆదాయ వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎదుటి వారిని చూసి ఆడంబరాలకు పోయి తమ ఆర్థిక స్థోమతకు, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తున్నారని తద్వారా వాటి కోసం అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్నారని తెలిపారు. కొన్ని ఆర్థిక సమస్యలు ఆత్మహత్యలకు కూడా దారి తీస్తున్నాయని చెప్పారు. కాబట్టి ప్రతి వ్యక్తి తమ కుటుంబ బడ్జెట్ రూపకల్పన చేసుకోవాలని, తద్వారా తాము చేసే ఖర్చులు తగ్గించి పొదుపు చేయడానికి దోహదపడుతుందని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి సంపాదన ముఖ్యమే కానీ ఎంత సంపాదిస్తున్నమన్నది ముఖ్యం కాదని ఎలా ఖర్చు చేస్తున్నామన్నదే ప్రధానం మని పేర్కొన్నారు. మన వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందని, పొదుపు చేయడానికి బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రమే ఎంచుకోవాలని అప్పుడే మీ పొదుపు డబ్బులకు సరైన భద్రత, భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ, బిసి సంక్షేమ అధికారిణి సునీత, జిల్లా ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.





# సజీవ సమాధి



▸▸ మొదటిపేజీ తరువాయి

టీమ్, జీపీఆర్ సాయంతో టన్నెల్‌లో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించింది. ఈ ప్రాంతాల్లో శరీర నిఘా కోసం మార్కింగ్ నిర్వహించారు. రక్షణ బృందాలు ఆచూకీని కనుగొని, బాధితుల మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

**అధికారికంగా ప్రకటించని అధికారులు..**

కాగా మృతదేహాల ఆచూకీ లభ్యమైనప్పటికీ ఇంకా ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సైతం మృతదేహాల లభ్యతను ధ్రువీకరించలేదు. ఇదంతా ఊహజనితమేనని మీడియాకు ప్రకటన విడుదల చేశారు. గత నెల 22న.. శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనుల్లో పైకప్పు కూలి.. ప్రమాదం జరిగింది. అప్పట్నుంచే టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే సొరంగంలోని పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా లేకపోవటంతో దాదాపు 11కుపైగా విభాగాలను రంగంలోకి దింపాల్సి వచ్చింది. గ్యాస్ కట్టర్‌తో బోరింగ్ మెషీన్ శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు. బురద, మట్టిని లోకో డబ్బాల్లో నింపి బయటకు పంపించారు. భారీ మోటార్లతో టన్నెల్ నుంచి సీపేజ్ వాటర్ పంపింగ్ చేశారు. మరోవైపు టీబీఎం శిథిలాలను తొలగించేందుకు రైల్వే శాఖ కూడా రంగంలోకి దిగింది. ప్రత్యేక నిపుణులతో రెండు బృందాలను నియమించింది. దీంతో అక్కడికి చేరుకున్న బృందాలు.. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయ చర్యలు చేపట్టాయి. అయితే సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అత్యాధునిక పరికరాలతో గాలింపు చర్యలు చేపట్టగా.. కార్మికుల ఆచూకీ నేటికి లభ్యమైనట్లు తెలిసింది. మృతదేహాలను గుర్తించటంలో ఐఐటీ మద్రాస్ కు చెందిన నిపుణులు పాత్ర కీలకంగా ఉన్నట్లు సమాచారం.

**స్వస్థలాలకు కార్మికులు!**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో జరిగిన ప్రమాదంతో భయాందోళనకు గురయిన అక్కడ పని చేస్తున్న వలస కార్మికులు తమ తమ స్వస్థలాలకు తిరుగుపయనమవుతున్నారు. టన్నెల్‌లో ప్రమాదంతో తమ కుటుంబ సభ్యులు భయపడుతున్నారని అధికారులకు చెప్పి సద్దిమూట సర్దుకుని అక్కడ్నుంచి వెళ్లిపోతున్నారు. టన్నెల్‌లో పని చేయాలంటే భయంగా ఉందని చెబుతూ.. పనులు ముందుకు సాగుతాయో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జార్ఖండ్, బీహార్, యూపీ, హర్యానాలకు బయల్దేరారు.

# వరంగల్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**కలంజ్యోతి, వరంగల్ :** వరంగల్ లో ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు మామునూరులో ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్ కు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్ పోర్ట్ ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. దీనిపై పలుమార్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దీంతో ఈ అంశంపై పౌర విమానయాన శాఖ గత నెల 25న ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్ కు లేఖ రాసింది. ఈ లేఖను రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రిత్వ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ (హెచ్ఐఏఎల్)కు పంపారు. దీనిపై స్పందించిన హెచ్ఐఏఎల్.. మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్ఓసీ) జారీ చేసింది. దీనికి కేంద్రం ఆమోదముద్ర వేసింది.

**ఇన్నాళ్లూ అడ్డంగా ఉన్న రూల్..**

హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ సమయంలో కేంద్రం, హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (హెచ్ఐఏఎల్) సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం 25 ఏండ్ల లోపు ప్రస్తుత ఎయిర్ పోర్ట్ కు 150 కిలోమీటర్ల పరిధిలో కొత్తగా దేశీయ/అంతర్జాతీయ విమానాశ్రం ఏర్పాటు చేయకూడదు. ఈ రూల్ కారణంగా రాష్ట్రంలో మరో ఎయిర్ పోర్టు నిర్మాణం జరగలేదు. అయితే ప్రస్తుతం హెచ్ఐఏఎల్ ఇచ్చిన ఎన్ఓసీ.. కేవలం మామునూరు ఎయిర్ పోర్ట్ కు మాత్రమే వర్తిస్తుంది.

**భూ సేకరణకు రూ.205 కోట్లు చెల్లింపు**

మామునూరు ఎయిర్ పోర్ట్ ను ఇపరేషన్స్ లోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. గతేడాది నవంబర్ 26న ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఎయిర్ పోర్టు విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూ సేకరణకు సంబంధించి రూ.205 కోట్లను ఇప్పటికే ఏఏఐకి అందజేసినట్టు వివరించారు. విమానాశ్రయ పనులకు అనుమతులు, అక్కడి నుంచి విమానాలు నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితోపాటు భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ లో విమానాశ్రయాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని వరంగల్ ఎయిర్ పోర్టుకు చకచకా అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు.



కలంజ్యోతి 3
శనివారం 01.03.2025 Local News



## శాంతియుతంగా జరుపుకోవాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో సామ రస్యంగా జరుపుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మో తిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, మంచిర్యా ల, జైపూర్,ఏ సీపీలు ప్రకాష్, వెంకటే శ్వర్లు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి హరీష్రజ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావులతో కలిసి మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, ముస్లిం మత పెద్దలతో రంజాన్ పండుగ వేడుక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగలను ప్రజలంతా సామర స్యంతో సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. రంజాన్ మాసం, ఈద్ఉల్‌ఫితర్ పండుగ నిర్వహణ కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ముస్లింలు ఉపవాసం ఉండే సమయాల్లో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ముస్లిం మత పెద్దలు, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి ఆమె సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణ సముదాయాలను అదనపు సమయాల్లో తెరిచి ఉండే విధంగా అనుమతించడం జరుగుతుందన్నారు. ముస్లింల సహాయార్థం టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలకు



ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ముస్లిం మత పెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సామరస్యమే సమాజానికి రక్ష

### జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత

**కలంజ్యోతి, జగిత్యాల :** సామరస్యమే సమాజానికి రక్ష అని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. రంజాన్ మాసానికి సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు కొ ఆర్డినషన్, శాంతి కమిటీ సమావేశానికి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా అధనపు కలెక్టర్ బీఎస్ లత అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా లత మాట్లాడుతూ.. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, లా, ఆర్డర్, శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ నిబంధనలు ఈద్గాల దగ్గర తగు ఏర్పాట్లు, ముస్లిం మైనారిటీ పెద్దలు సూచించిన అభ్యర్థనలను తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్ఎస్ చిత్రు, జెడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, అదనపు ఎస్పీ భీమ్ రావు, ఆర్డీఓలు, డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

**కలంజ్యోతి, జగిత్యాల :** జగిత్యాల జిల్లా ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షుడిగా ఊటూరి ప్రదీప్, జనరల్ సెక్రటరీగా మన్నె భాస్కర్, కోశాధికారిగా గొల్లపల్లి శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా పుల్లూరి దేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఎల్పీజీ డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి హరికృష్ణరావు, జనరల్ సెక్రటరీ హరిచరణ్ రావు,పెద్దపల్లి జిల్లా ఎల్పీజీ డీలర్ల సంఘం అధ్యక్షులు తిరుకోవెల ప్రవీణ్ కుమార్, రామ్ రెడ్డి, కొండపల్లి సతీష్‌లకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.



## ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక

**కలంజ్యోతి, రుద్రంగి :** రుద్రంగి మండలంలోని మానాల గ్రామంలో ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా పండుగు బాలనర్సు, ఉప అధ్యక్షుడిగా జలగడుగుల అంజయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలనర్సు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కులం ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పట్ల, కులంలోని నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అన్ని రంగాల్లో సంఘాన్ని ముందుకు తీసుకుపోయి ఇతర సంఘాలకు స్ఫూర్తిగా నిలిచే విధంగా సమైక్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో రుద్రంగి మండల అధ్యక్షుడు దాసరి అశోక్, మాజీ వైస్ ఎంపీపీ పిసరీ భూమయ్య, సంఘ సభ్యులు దూలూరు భూమయ్య, తూనికి రమేష్, నాంచారి రాజేందర్, నాంచారి రాకేష్, పీసరి మహేష్, గుర్రపు శేఖర్, జంగిలి చిన్నోళ్ల గంగారం, ఆటకర్ల గంగాధర్, చామంతుల యాదగిరి, గుర్రపు రాజేశం, జంగిలి మొండన్న, జంగిలి నడ్పి గంగారం పాల్గొన్నారు.

## మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**కలంజ్యోతి, నిర్మల్ :** మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా 2కే రన్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు 2 కే రన్ నిర్వహించారు. ఈ 2కే రన్ ను ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జడ్పి సీఈవో గోవింద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ సుభాష్, వెనుకబడిన తరగతుల అధికారి రాజేశ్వర్ గౌడ్, సిడిపిఓ నాగలక్ష్మి, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ అశోక్ కుమార్, ఎస్‌హెచ్‌జీల మహిళలు పాల్గొన్నారు.






## బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

**కలంజ్యోతి, గీసుగొండ :** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్‌లపై వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. గీసుగొండ మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం నేపథ్యంలో సదరు షాపుపై సోదాలు చేశారు. బేల పూర్ణచందర్ అనే వ్యక్తి షాపు నుండి రూ.76 వేల విలువ గల మద్యాన్ని పట్టుకుని గీసుగొండ పోలీసులకు అప్పగించారు.



## త్వరలో నామినేటెడ్

# పోస్టులు

## సీఎం రేవంత్ రెడ్డి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** వివిధ జిల్లాల్లో ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, ఇతర నామినేటెడ్ పోస్టులను ఈ నెల 10 తేదీ లోగా భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇన్ చార్జ్ మంత్రులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం గాంధీభవన్ లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ఏఐసీసీ ఇచ్చిన కార్యక్రమాల నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపు అంశాలపై చర్చించారు. పార్టీ, ప్రభుత్వానికి మంచి తెచ్చేలా చేపట్టాల్సిన చర్యలను కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం, పార్టీలో పదవులు వచ్చిన వారిలో కొందరు తమ పని తీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదవులు వచ్చిన వారందరూ పార్టీ కోసం కష్టపడాల్సిందేనన్నారు. పనితీరు సరిగా లేని వారికి రెన్యూవల్ ఉండదని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వ నిర్ణయాల్లో ఏవైనా లోపాలు, తప్పిదాలు ఉంటే టీపీసీసీ చీఫ్, తన దృష్టికి తీసుకురావాలన్నారు. పాలనపరంగా జరిగిన మంచిని మైక్ లో చెప్పాలన్న సీఎం.. చెడును చెవిలో చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లో పీసీసీ కార్యవర్గ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పార్టీలో గుర్తింపు ఉండటంతో పాటు పదవులు కూడా వరిస్తాయని, నామినేటెడ్ పోస్టులు కూడా అలాంటి వారికే ఇస్తామని చెప్పారు. సమర్థులైన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారిలో కొందరికి పదవులు రాలేదన్న సీఎం.. మరో విడతలో తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను మీనాక్షి సమన్వయం చేశారని తెలిపారు.

# ఇంటర్ పరీక్షల పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి



**కలంజ్యోతి, జగిత్యాల :** ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ లతో సీఎస్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, అదనపు ఎస్పీ భీమ్ రావుతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్న పత్రాలు జిల్లాకు చేరుకున్నాయని, రేపటి నుంచి ప్రశ్నాపత్రాలు స్ట్రాంగ్ రూమ్ లో నుంచి పోలీస్ స్టేషన్లకు చేరుతాయన్నారు. ప్రశ్నాపత్రాలు తరలింపు పోలీసు బందోబస్తు మధ్య ఉంటుందని అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాలు జిల్లాలో జరిగాయని, అవసరమైన మేర ఫ్లయింగ్ స్క్వార్డులను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, విద్యార్థులు ఎవరు సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకుని రావడానికి వీలు లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండాలని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు.

**ఎల్ఆర్ఎస్ పై..**

ఎల్ఆర్ఎస్ పై సమీక్షిస్తూ సీఎస్ శాంతి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ 2020 కింద 25 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. గత సెప్టెంబర్ 2024లో జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25శాతం రాయితీ పొందాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ 2025 మార్చి 5 నుంచి 25 వరకు జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం లో 7073 మంది, రెండవ సంవత్సరం లో 7377 మొత్తం 14450 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇందుకు గాను 28 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 27,369 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అందులో 1714 దరఖాస్తులు ప్రాసెస్ చేయబడినవని ఇంకను 22,519 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి నారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి రాము,ఆర్డీవోలు జివాకర్ రెడ్డి శ్రీనివాస్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు

**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర, వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఓపెన్ డే నిర్వహించారు. ఇందులో నాన్ సైన్స్ విభాగం విద్యార్థులకు ల్యాబ్ లలోని స్పెసిమెన్ లు,వివిధ మోడల్స్,ల్యాబ్ ఆపరేటర్స్ తదితర వాటిని ప్రదర్శించి విజ్ఞానం సూత్రాలను వివరించారు. కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో క్విజ్ నిర్వహించి విజేతలను అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ జి.చంద్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు రామన్ ఎఫెక్ట్ గురించి వివరిస్తూ,సైంటిఫిక్ టెంపర్ పెంపొందించుకోవాలని, అలాగే నేడు వేగంగా అభివృద్ధి జరుగుతున్న వైజ్ఞానిక ప్రగతిని తెలుసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో నీరజ, వాసవి, సుజాత, శ్రీలత, సత్యం, నరేష్, లక్ష్మణ్, గీత, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





## వాణి నికేతన్ హై స్కూల్‌లో

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులు తయారు చేసిన 150 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28 న భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' కను గొన్నందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. మానవుని మనగడ సైన్స్ పై ఆధారపడి ఉందన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, సైన్స్ టీచర్లు రాజు, కళ్యాణి, పద్మ, శాంత, సుమంగళి, ఉష, జలజతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** నూతన శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలలో యువత విద్యార్థులు గ్లోబల్ లీడర్ గా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో అంతర్జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు సందర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి, ఎస్సై రాజేష్‌రెడ్డి, ట్రాస్మా అధ్యక్షులు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జాంగిర్, ప్రిన్సిపాల్ కర్ణాకర్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

